# దొంగ

## శ్రీనామసేవ హరికృష్ణ

రాజారెడ్డికి కావాల్సిన రీతిలో పటిష్టమయిన యిల్లు తయారవుతోంది. ఎండకు గొడుగు పట్టి నిల్చుని కాంట్రాక్టరు పనులు చేయిస్తున్నాడు.

అపుడపుడూ స్వయంగా రాజారెడ్డి వచ్చి చూసి వెళుతున్నాడు. దొంగల భయం లేకండా చోర దుర్భేద్యంగా వుండాలని బాగా ఖర్చు పెట్టి కట్టిస్తున్నాడు.

శ్రేయోభిలాషి, ఆత్మీయుడూ అయిన రంగారెడ్డికి కాంట్రాక్టు యిచ్చాడు. మరొకరిని అంత సులువుగా నమ్మేవాడు కాదుమరి.

ఇన్ని రోజులూ 'కానీ' ఖర్చు చేయకుండా పోగేసిన ఆస్తి! యిప్పుడు దాన్ని దక్కించుకోవాలనే ఖర్చు పెడుతున్నాడు! అందమయిన ప్లాను అని ప్లాను ప్రకారం మూడడుగుల పిట్టగోడ మంచి డిజైనుతో చేయించాడు కాంట్రాక్టరు.

అది వద్దని అయిదు అడుగుల కాంపౌండు కట్టించాడు రాజారెడ్డి. మరుసటిరోజు కాంపౌండు సాయంతో మిద్దె పైకి ఎవరన్నా ఎగరగలరేమోనని పించింది. వెంటనే మిద్దె పైన గది ముందర ప్రత్యేకంగా 'గ్రిల్' వేయించాడు.

ఒకవేళ దొంగ వెధవ ఎవడైనా యిలా లోపలికి వస్తాడేమో... అలా ఎక్కి దూకి వెళతాడేమోనని ఎన్నో విధాల వూహిస్తూ- 'అలా సాధ్యం' అనిపించినప్పుడు- అక్కడ బందోబస్తుగా చేయమని పురమాయించాడు.

'ప్లాను మారిపోతోంది- రూపు చెడిపోతుంది' అన్నాడు కాంట్రాక్టరు.

'రూపం కాదు బందోబస్తు గావాలి!'' నిక్కచ్చిగా చెప్పాడు రాజారెడ్డి.

రాజా రెడ్డి పెద్ద ఆస్తిపరుడు. అదెలా సంపాదించాడో ఎవరికీ అంతు చిక్కని విషయం.

సారా కాంట్రాక్టరని కొందరు, స్మగ్లింగ్ చేస్తున్నాడని మరికొందరూ, ఎవరో పెద్ద సూట్‌కేస్ నిండా బంగారం తీసుకెళ్తూ ఓ లాడ్జిలో వదిలేసి పోలీసు భయంతో పారిపోగా, అక్కడ క్లీనర్‌గా పనిచేస్తున్న రాజారెడ్డికి దొరికిందని- దాన్ని మాయచేసి సొంతం చేసుకున్నాడని మరో కథా వినిపిస్తుంటారు.

మొత్తానికి దమ్మిడీ కానీ ఖర్చు చేయడు అనవసరంగా- చివరకు కొడుకుని ఎక్కువగా ప్రేమిస్తే- అదీ యిదీ కావాలంటాడేమో- డబ్బు ఖర్చయిపోతుందని కొడుకుని గాలికి వదిలేసాడు. అలా పెరిగి సంవత్సరం క్రిందట యిల్లు వదలి పారిపోయాడు- ఆ కొడుకు.

రాజారెడ్డి కాస్తంతే కాస్త బాధపడ్డాడు. చాల ఎక్కువగా భయపడ్డాడు. తన పేరు చెప్పి అప్పులు చేస్తాడేమోనని! రాజారెడ్డి భార్య మాత్రం అణుకువ కలది- రాజారెడ్డికి తెలియకుండా కొడుకుకు అవీ ఇవీ యిస్తుండేది - డబ్బు కావాలన్నప్పుడు మారాం చేయగానే యిచ్చేది. యిప్పుడు వాడూ లేడు- ఆ రోజు నుండి చిక్కి సగమైంది. ఆమె కంటి తుడుపుకు రెండు మూడుసార్లు పేపరులో, టి. వి. లో ప్రకటనలిచ్చాడు- అంతే. వాడింత వరకూ రానేలేదు.

కిటికీలకు 'గ్రిల్' వేస్తుండగా రాజారెడ్డి వచ్చి చూసాడు. కాస్సేపు కాంట్రాక్టరుతో అదీ యిదీ మాటాడి వెళ్ళిపోయాడు.

అంతలోనే తిరిగొచ్చాడు- ఏదో అనుమానం వేసి.

చిన్న కుర్రాళ్ళు ఇద్దరు, లోపల ఒకడూ బయట ఒకడూ నిల్చుని 'గ్రిల్'కు పెయింట్ చేస్తున్నారు. 'గ్రిల్' కన్నం గుండా చేయి చాచి లోపలున్న వాడి నుండి బ్రషూ, పెయింటూ తీసుకున్నాడు కిటికీ బయటి కుర్రాడు.

అది రాజారెడ్డి కళ్ళబడింది. అనుమానం దృఢమైంది.

'గ్రిల్ మార్చండి' అన్నాడు కాంట్రాక్టరుతో.

-'ఎందుకంటే ఇందులో కన్నాలు చేతులు పట్టేంతవిగా వున్నాయి. ఎవడైనా చేయి దూర్చి ఏదయినా పట్టుకెళ్ళవచ్చు. ఆడవాళ్ళ మెడలో గొలుసులు లాక్కెళ్ళవచ్చు గదా!

నేనే కిటికీ దగ్గరుంటే నా పర్సు కూడా కొట్టేయవచ్చు!' అన్నాడు మెల్లిగా.

''ఓరి నీ దొంగబుద్ధి మండ!''అనుకుని 'అయినా అదెలా సాధ్యం' అన్నాడు కాంట్రాక్టరు.

'ప్చ్. అదలా వుండానికి వీల్లేదు- మార్చేయాల్సిందే'నన్నాడు.

కన్నాలు చిన్నవై పోయాయి- ఖర్చులు పెరిగి పోయాయి.

పని మరింత పెరిగిపోతూనే వుంది. 'డబల్ వర్క్' చేయిస్తున్నావ్ అన్నాడు కాంట్రాక్టరు.

'అయితేమరి యిల్లు బలిష్ఠంగా వుండొద్దూ?

నలుగురూ నాలుగు పట్టుకెళ్ళేలా వుంటడానికా కట్టుకుంటాము?'' అన్నాడు రాజారెడ్డి.

'ఇల్లు నిముషాల్లో పూర్తవుతోందా' అన్నంత స్పీడుగా కట్టిస్తున్నాడు- త్వరలోనే ముహూర్తం కూడా నిర్ణయించాడు. ప్రస్తుతమున్న యింట్లో కునుకు పట్టటంలేదు- చోర భయం! 'ఈ డబుల్ వర్కులు లేకుంటే ఈపాటికి పూర్తయ్యేదే'' అన్నాడు కాంట్రాక్టరు.

అయినా ఫర్వాలేదు. గృహప్రవేశం పదిహేనవ తేదీ. తొమ్మిది గంటలా తొమ్మిది నిముషాలా తొమ్మిది సెకెన్లకి ముహూర్తం అద్భుతంగా వుందిట- అంటే ఎల్లుండికి పూర్తవుతే చాలు'' తృప్తిగా చెప్పాడు రాజారెడ్డి.

ఇల్లు కట్టుదిట్టంగా వుంది. గోడలు చాలా భద్రంగా వున్నాయి. పెల్లకూ పెల్లకూ మధ్య మేలు రకం "సిమెంటునే వాడారు. తలుపులు సరేసరి.

స్వయానా దొంగయిపోయి ఎలా దూరగలనా? అని ఆలోచించి, దాన్ని నిరోధిస్తూ కట్టించటంతో దొంగల తాకిడి వుండదు.

గృహప్రవేశం ముందు రోజు రాజారెడ్డికి నిద్దరపట్టలేదు- ఓ నిర్ణయానికొచ్చాడు.

'గృహప్రవేశం తరువాత హాయిగా నిద్ర పోవాలంటే ఈ రాత్రి తనా యింట్లో ప్రవేశించగలడేమో చూడాలి.... దొంగలాగా! వాచ్‌మేన్ తప్ప ఎవరూ వుండరు. ఒకవేళ ఏదైనా 'వీక్ పాయింటు' కనిపిస్తే ముహూర్తం లోపల సరి చేయించాలి. లేదా ముహూర్తాన్ని వాయిదా వేయాలి' అనుకున్నాడు.

పై ముసుగు వేసుకుని రాత్రి రెండు కాగానే బయలుదేరాడు. కాళ్ళలో తత్తరపాటుండనే వుంది. అయినాసరే- యిల్లు తన వూహలకి తగ్గట్టు కట్టాడా లేదానని తేల్చుకోవాలి!

వెన్నెల్లో మిలమిల మెరస్తుంది కొత్త యిల్లు!! దిష్టిబొమ్మ వేలాడుతూంది- 'దొంగెధవా దొంగ బుద్ధులూ' అంటున్నట్టనిపించింది.

''సరి సరి... ఆ బుద్ధుల్లేకపోతే దొంగెధవ ఎలా దూరివస్తాడో ఎలా తెలుస్తుంది? ఎలా జాగ్రత్తపడగలను? యింత పటిష్టంగా యింటి ప్లాను వేయగల వాడెవ్వడు?. అని సర్ది చెప్పుకున్నాడు రాజారెడ్డి.

పంచె పై వరకూ కట్టి కష్టపడి కాంపౌండు ఎక్కి లోనికి దూకాడు. చీకట్లో కనబడక వాచ్‌మెన్ మీదే పడ్డాడు.

చచ్చాన్రోనని లేచి కూర్చుంటూ 'ఎవడ్రా దొంగెధవ- యింకా ఎవరూ జేరకనే వచ్చిన తిక్కెధవ'. పక్కనే వున్న కర్రతో రెండు దెబ్బలు చీకటిలోనే వాయించాడు వాచ్‌మెన్.

వాడికి తనెవరైందీ సర్ది చెప్పేసరికే రాజారెడ్డి తలప్రాణం అరికాళ్ళలో దూరిపోయింది. వాడి చేతిలో నోటు పెట్టి, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని



అప్పటికప్పుడు వాడిని పర్మనెంటు వాచ్‌మెన్‌ని చేసేసాడు

రాజారెడ్డి మనసు కుదుటపడింది 'మంచి యిల్లు అంతకు తగ్గ వాచ్‌మేను ఇహ ఈ 'మేను' హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు'' అనుకున్నాడు

ఇంటికి వెళ్ళాడు తెల్లారేలోగా

తెల్లారే కొడుకు తిరిగి వచ్చాడు- దేశాంతరాలకు వెళ్ళినవాడు చిక్కి సగమయ్యాడు

కొడుకు మీద ప్రేమతో రాజారెడ్డి బార్య మాత్రం ఏడ్చింది

ఇంకోసారిలా వెళ్ళకు బాబూ అంది-

'బయట జీవితం తెలిస్తే వాడే బాగుపడతాడు నీవు ముద్దు చేస్తూ తినబెడితే కొండలైనా తక్కువ పడ్తాయి' విసురుగా అన్నాడు రాజారెడ్డి

'చాల్లెండి శుభముహూర్తాన గృహప్రవేశం చేస్తున్నాం- అల్లాంటి మాటలెందుకంటారు మన యిల్లు కట్టిన వేళా విశేషం- కొడుకు తిరిగొచ్చాడు'' అంది

రాజారెడ్డి పనుల్లో మునిగిపోయాడు

గృహప్రవేశం జరిగిపోయింది శాస్త్రిగారికి దక్షిణ అనుకున్నంత ముట్ట లేదని కాబోలు నాలుగుసార్లు నసిగారు

ముహూర్తం తొమ్మిది సెకెన్లకయిపోవాలి అంటే తొంభై సెకెన్లు లేటయిపోయింది ఒకటిన్నర నిముషం తేడాయా? అంటూ ఎంతో గుణిశారు

ఏమయితేనేం ఎందరో వచ్చారు అతిదులు

యింటినీ, రాజారెడ్డి తెలివినీ పొగిడ వెళ్ళిపోయారు

ఆ సాయంత్రమే ఆ యింట్లోకి మారిపోయారు- కారణం అంతవరకున్న యింట్లో బద్రత తక్కువని రాజారెడ్డికి కునుకు పట్టక పోవటమే

రాజారెడ్డి బార్యకూ కొత్త యింట్లో చేరిపోవాలనే వుంది

– కొడుకు యిల్లు విడిచినప్పటి నుండీ ఆమెకూ కంటి రెప్ప వాలలేదు ఈ రోజు తిరిగి వచ్చాడు–

రాజారెడ్డి యింటి చుట్టూ తిరిగి వచ్చాడు వీది చివరి వరకు వెళ్ళి నడుచుకుంటూ అన్ని యిళ్ళు చూస్తూ వచ్చాడు అన్ని యిళ్ళ కంటే తమ యిల్లు అందంగా వుంది పైగా బద్రంగా కట్టించాడు- ప్రక్కనే వున్న యిల్లు అప్పుడే సిమెంటు రాలుస్తూంది'

నాలుగైదుసార్లు, నాలుగైదు యాంగిల్స్‌లో – వీది చివరి నుండి ఈ చివరి వరకూ తిరుగుతూ గమనించాడు

'ఇక గుండెల మీద చేయి వేస్కుని హాయిగా పడుకోవచ్చు' అనుకున్నాడు వెంటనే బరువంతా దిగిపోయినట్లుంది మనసంతా తేలికగా దూది పింజలా మారిపోయింది హాయిగా వూపిరి తీసుకున్నాడు చాలాకాలం తరువాత'

గేట్లో వాచ్‌మెన్ 'నమస్కారం దొరగారు అన్నాడు

వాడి చేతిలో బలమైన కర్రని చూసి తృప్తిగా తలాడిస్తూ లోపలికెళ్ళిపోయాడు

చాలా రోజుల తరువాత మొదటిసారిగా మెలకువ లేకుండా నిద్రపోయాడు ధైర్యంగా

తెల తెల్లవారుతోండగా మెలకువయ్యింది

అలవాటు ప్రకారం యినప్పెట్టె వైపు చూసాడు

గుండె 'ఝుల్లు'ంది గొల్లుమని బయటికి పరుగెత్తుకెళ్ళాడు

చుట్ట నోట్లో పెట్టుకోబోతున్న వాచ్‌మెన్ రెడ్డిని చూసి చుట్ట తీసి జేబులో పెట్టుకున్నాడు

రాజారెడ్డి గొల్లుమంటూనే కోపంగా అరిచాడు

''ఒరేయ్ లమ్డి కొడకా- నిన్ను వాచ్‌మెన్‌గా పెట్టుకున్నందుకు నా నెత్తిన బూడిద గొట్టావ్ ఇంట్లో దొంగల్పడ్డార్రా ఎదవా నిన్ను నిన్ను ' ఆవేశంగా ముందుకురికాడు రాజారెడ్డి–

వాచ్‌మెన్ ఆశ్చర్యపోతూ నాలుగడుగులు వెనక్కి వేస్తూ 'చినబాబు వూరికెళ్ళే ముందు కూడా నాను తిరుగుతూనే వున్నా బాబూ- చినబాబు వెళ్ళాక కూడా తిరిగాను ఇప్పుడే ఇలా కూకున్నా''' తెల్ల మొహం వేస్తూ చెప్పాడు రాజారెడ్డి ఆగిపోయాడు

ఏమన్నావ్ నా కొడుకు వూరెళ్లాడా''

ఆయితే అది వాడి పనే!''' మెల్లగా గొణుక్కుంటూ కుప్పగా కూ ... □